# ప్రతిఫలము

★

శ్రీ విశ్వనాథ అచ్యుతదేవరాయలు

త్రిపాఠీ మళ్లీ ఉత్తరం వ్రాశాడు. దసరా శలవలకు డెహారాడూనుకు రమ్మనమని. శలవలు గడపటము ఏలాగా అని నేనూ అనుకుంటున్నాను. ఉత్తరము సమయానికే వచ్చింది. అడవులలో మేమిద్దరమూ కలసి 'షికారు' పోయి చాలా రోజులైనది. నేను డూనుకు వెళ్ళినాను.

త్రిపాఠీవాళ్లది కలసంసారము. వాళ్లది డూనుకు దగ్గరగా ఒక పల్లెటూరు. అతనుమాత్రం డూనులో ఉంటున్నాడు. అతనూ నేనూ కలసి చదువుకున్నాము. మా ఇద్దరికీ అడవులలో తిరగటమంటే విపరీతమైన సరదా. నేను నా కెమేరాతోను, త్రిపాఠీ తన తుపాకితోనూ 'కుమావూను' అడవులలో ఎన్ని రాత్రులు గడిపినామో! నేను అడవిమృగాల ఫోటోల నెన్నో తీసినాను. తీసిన ప్రతిఫోటో అతను దగ్గరగా నున్నపుడే. ఆ సమయంలో అతని తుపాకి నాకు రక్ష. అతని తుపాకి క్రింద నేను ఎంత కీకారణ్యములోనైనా నిర్విచారముగా తిరిగేవాడిని. తుపాకి గురిచూడటములో అంత ప్రజ్ఞ కలవాడిని తిరిగి నే నింకొకనిని ఎరుగను. వేట, దాని పరిజ్ఞానమంతా నే నతనిదగ్గర నేర్చుకున్నదే. అడవిలో మృగాల వెంబడి తిరగడం, వాటి అలవాట్లను పరిశీలించడం, వాటికి మల్లే అరవడం—అతను నాకు నేర్పినవే. అడుగుల గుర్తు చూడగానే, జంతువు యొక్క వయస్సు, సుమారుగా అది పోయిన వేగము, తెలుసుకొనటము అతను నాకు నేర్పిన విద్య. నే నతనికి నేర్పిన దింకొకటి. అది, అనవసరముగా తుపాకిని ఉపయోగించక పోవటము. ఇదివరకు అతను అడవిలోనికి వెడితే ఏదో ఒక మృగాన్ని కొట్టి తెచ్చేవాడు. వాళ్లయింట్లో గోడల నిండా పులుల తలకాయలు. నేలమీద జింకచర్మాలు. అతను అడవినుండి ఏ జంతువునూ తీసుకు రాకపోవటము ఈమధ్య జరుగుతున్న విషయము. ప్రాణరక్షణ కోసము తప్ప, ఇంకెందుకూ ఏ మృగాన్నీ కొట్టకూడదు. సుఖదుఃఖాలు సర్వ ప్రాణులకు సమానమన్న మాట నే నతనికి గట్టిగా చెప్పాను.

ఇదివరకు నేను చూచినప్పుడు త్రిపాఠీ కొడుకు మరీ పసివాడు. ఇప్పుడు కమల నయనుడు కొంచెము సాగినాడు. దొడ్డి అంతా ఒకటే గంతులు. వాడిని చూస్తే నాకు మరీ ముద్దయినది. త్రిపాఠీ అన్నాడు.

"ఈసారి కనక వీలైతే చిన్న లేడిపిల్లను పట్టుకు రావాలి. మా అబ్బాయి ఆడుకునేందుకు."

"ఈ సింహ శాబకాన్ని చూచి, అదికాస్తా బెదిరిపోతుందేమో" నన్నాను.

సాయంకాలము వాళ్ల కారులో బయలుదేరి అడవిలోనికి పోయి, ఆ రాత్రికి ఫారెస్టు బంగళాలో పడుకున్నాము. మరునాడు ప్రొద్దుననే లేచి బంగళా వెనకనున్న కొండమీదికి బయలుదేరినాము. కొంత దూరము ఎక్కిన తరువాత పెద్ద వడగండ్ల వాన కురిసినది. వాన కురిసినంత సేపు ఒక నున్న చెట్టుకింద నిలబడినాము. అడవిలో వాన కురిస్తే ఎప్పుడూ చిన్న చెట్టునుచూచుకోవాలి. ఎత్తైన చెట్ల మీద పిడుగులు తరచుగా పడుతూ ఉంటాయి. వాన వెలవడమేమిటి! మబ్బులలోనుండి పిలపిలా ఎండ రావడమేమిటి! రెండూ ఒక్కసారే జరిగినవి. తడిసిన రాళ్ళమీద కాళ్ళు జారటము మొదలు పెట్టినవి. ఇంక పైకి ఎక్కటానికి అవకాశము లేక, ఎడమ వైపున ఉన్న దట్టమైన అడవిగుండా వెళ్ళినాము. అడవి దాటగానే పెద్ద పచ్చిక బయలు. మేమింకా చెట్లు దాటకుండానే దూరాన ఒక జంతువు కనబడినది. ఆ చెట్లసందునుంచి, దాని తోక, కాళ్ళు మాత్రమే కనపడినవి. అది తల ఎత్తితే లేడి అని తెలిసినది.

ఆ పచ్చిక బయలులో, మేము నుంచుని ఉన్న చెట్లకు కొంచెము దూరముగా, నాలుగు అడుగుల ఎత్తున ఒక పెద్ద బండఉన్నది. దానికి చుట్టుపట్ల ఏమీ చెట్టుగాని, చేమగాని లేదు. సాధారణంగా లేళ్ళు అడవిలో గుంపులుగా ఉంటయి. ఆ లేడి మాటిమాటికి తలఎత్తి తూర్పువైపు చూస్తున్నది. దానిని బట్టి లేళ్లగుంపు ఆవైపు ఉన్నదనీ, మాకు కనబడే లేడి కాపలాదారనీ వెంటనే తెలిసింది. త్రిపాఠీ అన్నాడు. ఆలేళ్ల గుంపులో కనక లేడిపిల్లఉంటే తప్పకుండా పట్టుకోవాలి.' నేనూ దానికి సరే నన్నాను.

మా నిర్ణయము ప్రకారము నేను చెట్టు చాటున నుంచున్నాను. త్రిపాఠి ఆ లేడి తలఎత్తి నప్పుడల్లా ఆగిపోతూ, గడ్డిపరకలు కొరుకుతున్నప్పుడు ప్రాకుతూ, ఆ రాతిబండ చాటునకు చేరినాడు. త్రిపాఠి చెయ్యి విసరగానే నేను చెట్టుచాటునుంచి, లేడి మళ్లీ గడ్డిపరకలకోసం మెడ వంచగా చూసి, చిరతపులికి మల్లే అరిచాను. మేము కొండ ఎక్కేటప్పుడే, చిరతపులి అడుగులు కనపడ్డవి. అందువలన చిరతపులి ఆ కొండమీద ఉన్నదన్న మాట.

నాగొంతు వినగానే ఆ లేడి ఒక్కసారి గిరుక్కున తిరిగి, ముందర కాళ్లను నేలమీద కొట్టటం మొదలు పెట్టింది. అంటే, అపాయమును తక్కిన గుంపుకి తెలియ చెప్పుతున్న దన్నమాట. కాని ఆ గుంపులోని తక్కిన లేళ్లను చూడటానికి వీలు పడ లేదు. ఈ లేడి చయముతో కూస్తేగాని, అవి బండ ప్రక్కగా పరుగెత్తుకుని రావు. ఈ లేడి చిరతపులిని చూస్తేగాని కూయదు. నేనప్పుడు పసుపురంగు ట్వీడు కోటు తొడుక్కున్నానేమో, నా కుడిభుజమును, చెట్టుచాటున నుంచి కొంచెము బయటపెట్టి, రెండు సార్లు కదిల్చాను. ఆ కదలికను వెంటనే గుర్తుపట్టి, ఆ లేడి రెండు గంతులు ముందరకు గంతి, కూయటము మొదలు పెట్టింది. అపాయము దగ్గరలోనున్న దన్నమాట. అన్నీ ఒకటి తరువాత ఒకటి కూసిన లేడి దగ్గరకు చేరుతున్నవి. మొదట ఒక పెద్ద లేడి బండ ప్రక్కగా వచ్చినది. తరువాత రెండు దుప్పులు. తరువాత లేడి పిల్ల తల కనపడినది. వెంటనే త్రిపాఠీ లేచి నిలపడ్డాడు. చేతిలో లేడి పిల్ల, లేళ్లగుంపు ఒక్క పెట్టు అరచి, చెల్లాచెదరై దూరంగా పారిపోయినవి. అన్నీ దూరంగా పోయినా తల్లి లేడిమాత్రము పదిగజాల దూరము పోయి వెనక్కి తిరిగి చూస్తూ నిలబడింది. అప్పటికే నేనుకూడా ఆ బండ దగ్గరకు వెళ్లాను. పిల్లను కోల్పోయిన ఆ తల్లి చూపులు నా గుండెకు తాకినవి. వెంటనే నా కెమేరాతో దానిని ఫోటో తీశాను. త్రిపాఠీతో ఆ లేడిపిల్లను వదలమందా మనుకున్నాను. అతని ఉత్సాహము నన్నామాటను అననీయ లేదు. త్రిపాఠీ లేడిపిల్లను చంక నెత్తుకున్నాడు. అతని తుపాకిని కూడా నేను మోస్తూ, బంగళాకు చేరినాము.

డూను చేరిన తరువాత, కమలనయనుని ఉత్సాహానికి మేర లేదు. వాడే లేడిపిల్ల; వాడికింకొక లేడి పిల్ల. క్రమంగా వాళ్లిద్దరికీ స్నేహము బలిసిపోయింది. నెలరోజులు తిరగకుండానే కమల నయనునికి లేడి పిల్ల ప్రాణమయిపోయింది.

నేనా తల్లి లేడి ఫోటోను పెద్దది చేయించి, నా గదిలో గోడకు తగిలించాను. ఆ బొమ్మవంక చూచినప్పుడల్లా, ఆ లేడి కళ్లలోని దైన్యమంతా ఒక్కసారి స్ఫురించేది. అది మళ్లీ తన పిల్లను తన కిమ్మని అడుగుతున్నట్లనిపించేది. లేడిపిల్లను తీసుకుపోయి మళ్లీ ఆ పచ్చికబయలుమీద వదలితే! కమల నయనుని ఉత్సాహానికి భంగమౌతుందేమో!

ఇంతలోనే దసరా పండుగలు వచ్చినవి. దసరాపండుగకు 'కూలూ లోయ'లో పెద్ద ఉత్సవం జరుగుతుంది. ఆనాటికి ఆ చుట్టుపట్ల అన్ని దేవాలయాలలోని, ఉత్సవ విగ్రహాలను పెద్ద ఊరేగింపులతో ఒక్కచోట చేరుస్తారు. ఈ ఉత్సవాన్ని చూడటానికి ఆ చుట్టుపట్ల ప్రాంతాలన్నిటినుంచీ జనం గుంపులుగా వస్తారు. మేముకూడా బయలుదేరి 'కూలూ' వెళ్లాము.

జనం ఇసకవేస్తే రాలటంలేదు. తప్పెట్లూ, తాళాలూ, కమలనయమనికి బాగానచ్చినవి. ఆ ప్రదేశమంతా తిరిగి, సాయంత్రానికి యింటివైపు బయలుదేరాము. కమల నయనుడు కనపడలేదు. తప్పిపోయినాడు. అంతవరకూ మా వెంటనే ఉన్నాడు. ఏలాగ తప్పిపోయినాడో తెలియలేదు. చుట్టుపట్ల అంతా వెతికినాము. కనపడ్డవారినల్లా అడిగినాము.

ఆ చోకీ లేదు. త్రిపాఠీకి పిచ్చిఎక్కినట్లైనది. ఆయన భార్య నయము. కొంచెము ధైర్యముగానున్నది. త్రిపాఠి ఉద్వేగాన్ని మేము ఆపలేకపోయినాము. తిరిగి, తిరిగి, రోడ్డుప్రక్కన ఒక బండమీద కూలబడినాము. త్రిపాఠీ మౌనంగా కూర్చున్నాడు. దైన్యమంతా అతని కళ్లల్లోనికి వచ్చింది. ఆ కళ్లను చూస్తే ఫొటోలో లేడి కళ్లు జ్ఞాపకానికివచ్చినవి.

డూనులో ఇంటిదగ్గర ఎవ్వరూ లేరు. ఇల్లంతా నౌకర్లమీద వదలివచ్చినాము. నేను డూనువెళ్లి యింటి సంగతి చూడటము. తల్లితండ్రు లిద్దరూ కమలనయనుని వెతకటము. ఆ రాత్రికే నేను డూను చేరాను.

రాత్రికి నా గదిలో విశ్రమిస్తూఉంటే, మళ్లీ ఆ ఫోటోను చూచాను. నామనస్థితివల్లనో ఏమో, ఆ రోజున ఆ కళ్లు మరీ దైన్యముగా ఉన్నాయి. ఆ లేడివంకనే చూస్తూ నిలపడ్డాను. అప్పుడే పదిగజాల దూరముపోయి వెనక్కి తిరిగి నిలబడినది. త్రిపాఠి చేతిలోని, తన పిల్లవంక రెప్పవాల్చకుండా చూస్తోంది. “కమల నయనుడింక కనపడడా ?” “నా పిల్లను నాకిస్తావా మరి” అన్నదా లేడి. కళ్లల్లోని నీటి బిందువులు తుడుచుకుని చూచాను. లేడి కదలటములేదు. అది కన్నీటి బొట్ల కదలిక. లేడి మళ్లీ యథాప్రకారముగా చూస్తున్నది.

ఆ తెల్లవారు జామునే డ్రైవరును లేపి కారుమీద నలభై మళ్లుదాటి, ఫారెస్టు బంగళాకు పోయినాను. సూర్యోదయమవుతూ ఉండగా వెనకనున్న కొండ నెక్కాను. కొండను చూచిన దగ్గరనుంచీ లేడిపిల్ల గెంతటము మొదలుపెట్టింది. నానిని చేతులలో పట్టుకోనటము కష్టమయిపోయినది. అది నిలవటములేదు. అడవిదాటి, ఆ మైదానములో దానిని వదలివేశాను. ఆ మైదానమంతా ఖాళీ. ఒక్క లేడి కూడా అక్కడలేదు.

తిరిగి డూనువచ్చేటప్పటికి సాయంత్రం మూడయినది. నేను వచ్చేటప్పటికి, త్రిపాఠీ, భార్యా, కమల నయనుడు, వాకిట్లో కుర్చీలలో కూర్చున్నారు. నన్ను చూడటములోనే, కమల నయనుడు ఎగిరి నా ఒడిలోనికి దూకాడు. రోడ్డుప్రక్కన ఒక్కడే కూర్చున్నాడట. వాళ్ల ఊరివాడెవరో ఉత్సవానికి వస్తే, కమల నయనుని గుర్తుపట్టి, తనవెంట తెచ్చి, త్రిపాఠీకి అప్పచెప్పినాడట. కమలనయనుడు ఉద్దండుడు. వాడు ఏడవనే లేదట.

కమల నయనుడు ‘నా లేడిపిల్ల ఏది?’ అని అడిగాడు. ‘నువ్వు మీ నాన్నదగ్గరకువచ్చినట్లే అది వాళ్ల తల్లితండ్రులవద్దకు పోయిన’దన్నాను. ఆ మాట వినిపించుకోకుండా, కమల నయనుడు దొడ్డిలోనికి లేడిపిల్లకోసం పరిగెత్తాడు. నేను కమల నయనుడు లేచిపోయిన పడక కుర్చీలో నడుము వాల్చాను. ఆలోచన మైదానము మీదకుపోయింది. ఇప్పటికి లేడిపిల్ల గుంపులో కలిసినది కావలెను!

